

చిన్నారి వైద్యానికి రూ.23 వేల సాయం

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరం సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వేమగిరి గ్రామానికి చెందిన చిన్నారి లాస్య వైద్యానికి వేమగిరి జక్కంపూడి నగర్‌కు చెందిన గణేష్ యూత్ సభ్యులు రూ.23,100లు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఆసుపత్రిలో గణేష్ యూత్ సభ్యులు లాస్య తండ్రికి అందించారు. ఈ సందర్భంగా లాస్య తల్లిదండ్రులు గణేష్ యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



సాయం అందిస్తున్న గణేష్ యూత్ సభ్యులు

కౌంటింగ్‌లో ఏజెంట్లే కీలకం

నిబంధనలు తెలియకుంటే అయోమయమే

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మరో 24 గంటల్లో ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లు ఆ వెంటనే ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఈ మేరకు ఇవిఎం ఓట్ల కోసం పోలింగ్‌బూత్ పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్ , ఎసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్, ఇటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్ కోసం 18 టేబుల్స్ ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన ఓట్లు లెక్కింపు కోసం సహాయ రిటర్నింగ్ అధికారులు ఏడుగురు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు 119మంది, సహాయకులు 126 మంది, సూక్ష్మ పరిశీలకులు 140మంది, ఇతర సిబ్బంది 119 మంది చొప్పున విడివిడిగా నియమించారు. ఓట్ల లెక్కింపులో కీలకమైనది పార్టీలు, అభ్యర్థుల ఏజెంట్ల నియామకం. వీరికి ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా అభ్యర్థుల గెలుపు ఓటములు తారుమారయ్యే ప్రమాదం ఉంది. ఎన్నికల నిబంధనలు-1961 ప్రకారం ఓట్ల లెక్కింపులో సందేహాలు, అనుమానాలు వస్తే ఏం చేయాలి? అధికారులు, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే ఎలా వ్యవహరించాలి? వంటి అంశాలపై స్పష్టత ఉండాలి. రాజకీయ పార్టీలు కూడా ఓట్ల లెక్కింపు ఏజెంట్ల నియామకంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. గతంలో లెక్కింపులో పాల్గొన్న వారికే ప్రాధాన్యత ఇస్తూ.. వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చాయి.

ట్యాంపరింగ్ జరిగితే

కంట్రోల్ యూనిట్ టేబుల్స్ పైకి రాగానే అభ్యర్థి సీలింగ్ సెక్షన్ సక్రమంగా ఉందో లేదో కౌంటింగ్ ఏజెంట్లు చూసుకోవాలి. రిజల్ట్ సెక్షన్ స్రిప్ట్ సీల్డ్, గ్రీన్ పేపర్ సీల్డ్ సక్రమంగా ఉన్నాయో లేదో చూడాలి. సీరియల్ నెంబర్లు ఫారం-17, 17సిలో నమోదు చేసినవే ఉండాలి. కంట్రోల్ యూనిట్ పేపర్ల సీల్డ్, అడ్రస్ ట్యాగులు ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిస్తే పరిశీలకులు ఆ విషయాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. ట్యాంపరింగ్ జరగని కంట్రోల్ యూనిట్లను మాత్రమే లెక్కించాలి. ఒకవేళ కంట్రోల్ యూనిట్ ఆన్ కాకుంటే ఆర్‌ఒకు తెలియజేయాలి. ఆయన సరి చేస్తారు. అప్పటికీ పని చేయకపోతే పక్కకు తీసుకువెళ్లి కంట్రోల్ యూనిట్‌కు సంబంధించి వీవీ ప్యాట్ స్లిప్స్ కౌంట్ చేస్తారు. ఎంపీ, ఎంఎల్ఎ స్థానాల ఫలితాలకు సంబంధించి వేర్వేరుగా కౌంటింగ్ హాల్స్ ఉంటాయి. ఏజెంట్లకు కేటాయించిన టేబుల్స్ వద్ద మాత్రమే కూర్చోవాలి. అటూ ఇటూ తిరగరాదు. వేరే టేబుల్ వద్దకు వెళ్లి కూర్చోరాదు. ఫలితాల వెల్లడి సమయంలో అభ్యర్థి వివరాలతో సహ అన్నీ ఏజెంట్లు రాసుకోవాలి. అన్ని ఫలితాలను కౌంటింగ్ సూపర్‌వైజర్ కూడా నమోదు చేస్తారు.



ఏజెంట్లకు అవగాహన తప్పనిసరి

ఫారం-17సి పార్ట్-2 కీలకమైనది. ప్రతి కౌంటింగ్ ఏజెంటు, పరిశీలకులు, సహాయ పరిశీలకులకు దీనిపై అవగాహన ఉండాలి. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓటర్లు ఫారం-17సి లోనే పొందుపరిచిన మొత్తం ఓట్లు సరిపోల్చి చూడాలి. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ నెంబరు, పోలింగ్ కేంద్రం పేరు, ఆ పోలింగ్ కేంద్రంలో వినియోగించిన కంట్రోల్ యూనిట్ బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు నెంబర్లను ఆ ఫారంలోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల సంఖ్య పోలింగ్ కేంద్రంలోకి వచ్చాక ఓటు వేయడానికి నిరాకరించి వెళ్లిపోయిన వారి సంఖ్య, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య, ఫారం-17సిలో ఉంటాయి. టెండర్ బ్యాలెట్లు సరఫరా చేసిన పేపర్ సీల్డ్ (ఓటరుకు పోలింగ్ కేంద్రంలో ఇచ్చే రెండు రంగుల స్లిప్పులు) సీరియల్ నెంబర్లు, ఎన్ని పేపర్లు వినియోగించారు. వినియోగించని పేపర్ల సీల్డ్ ఎన్ని తిరిగి రిటర్నింగ్ అధికారికి వెళ్లాయి. పాడైన పేపర్ సీల్డ్ సీరియర్ నెంబర్ల వివరాలు ఇందులో ఉంటాయి.

కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్నాం..

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కౌంటింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం వెలగపూడిలోని ఎపి సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల ఓట్ల లెక్కింపు, జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, తదిత రులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా సమీక్ష నిర్వహించారు. స్థానిక నన్నయ్య యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్‌ఒ చాంబర్ నుంచి కలెక్టర్ ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 4న ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సజావుగా కౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ప్రకారం నడుచుకోవాలని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్స్‌కు స్పష్టం చేశామన్నారు. పలు పర్యాయాలు సమావేశాలు పెట్టి వారికి కౌంటింగ్ అంశాలను వివరించామని, అభ్యర్థులు, ఏజెంట్లకు ఐడి కార్డులు, వాహనాల పాసులు గురించి తెలియజేశా మన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా సజావుగా నిర్వహించేం దుకు అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, ఇటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఇవిఎం ఓట్ల లెక్కింపునకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, రౌండ్ల వారీగా ఫలితాల ట్యాబులేషన్, ఎన్కోర్‌లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటి సిస్టంల ఏర్పాటు, డిజిటల్ స్రీన్స్ ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తదుపరి ఇవిఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైస్ నివేదికలు పంపించేం దుకు ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. ఈ నెల 8లోపు నివేదించాల్సిన ఇండెక్స్ కార్డు రూపొందించే విధానం, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు

మాజీ ఎంఎల్ఎ కృష్ణబాబుకు పలువురి నివాళి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మాజీ ఎంఎల్ఎ, పారిశ్రామిక వేత్త పెండ్యాల కృష్ణబాబు దశదిన కార్యక్రమం దొమ్మేరులోని ఆయన స్వగ్రామంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, నరసాపురం పార్లమెంట్ సభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పల్లం రాజు సినీ నిర్మాతలు కెఎల్.నారాయణ, ఎంఎల్.చౌదరి, వ్యాపారవేత్త పొట్రు బ్రహ్మానందం, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, మాజీ ఎం.పి ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి.రామచంద్రరావు, తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరుణకుమారి హాజరయ్యారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కృష్ణబాబు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తొలితరం సంగీత విద్వాంసుడు 'మంగమూరి' మృతి

ప్రజాశక్తి-కడియం

తొలితరం సంగీత విద్వాంసులు, ప్రముఖ నాదస్వర విద్వాంసులు మండలంలోని జేగురుపాడు సంగీత వాయిద్య మండలి వ్యవస్థాపకులు మంగమూరి భాస్కరరావు(85) ఆదివారం మతి చెందారు. జేగురుపాడు మ్యూజికల్ బ్యాండ్ టీం భాస్కరరావుగా ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశా-ఖపట్నం తదితర ప్రాంతాల సంగీత ప్రియులకు భాస్కరరావు సుపరిచితులు. ఆయన నాదస్వరం, సన్నాయి, ట్రంపెట్, ఫ్లూట్, డ్రమ్స్ తదితర సంగీత పరికరాల్లో నిష్ణాతులు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు వెంకట్రావు శిష్యరికంలో ఆయన సంగీత మెలకువలు నేర్చుకున్నారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు కూడా సంగీత వాయిద్య కళాకారులుగా రాణిస్తున్నారు. ప్రముఖ కవి, రచయిత అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు గండి స్వామిప్రసాద్ ఆయనకు స్వయానా అల్లుడు. ఆయన మృతి పట్ల విజయవాడ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గండి నాగేంద్రప్రసాద్, బ్యాంకింగ్ ప్రొఫెషనల్ ట్రైనీ ఎం.ప్రసాదరావు విజయవాడ డివిజన్ రైల్వే స్టేట్ మాస్టర్ గండి రాజేంద్రప్రసాద్, సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఎంపిటిసి మాజీ సభ్యులు పాలపర్తి ప్రకాష్‌కుమార్, యాదల మహేంద్రవర్మ, రాజమహేంద్రవరం, కాతేరు ఫీల్డ్ లేబర్ సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ఐసిఐసి బ్యాంకు మేనేజర్ ఎంపి.రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.





శిబిరంలో కథలు చదువుతున్న చిన్నారులు

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం స్టోరీలు చెప్పడం, స్టోరీలు చదవడంపై శిక్షణ ఇచ్చామని గ్రంథాలయ అధికారి కె.సుమన్‌కుమార్ తెలిపారు. గ్రంథాలయంలో వివిధ పుస్తకాలను విద్యార్థులకు చూపించామన్నారు. కేరమ్స్, డ్యాన్స్ విభాగాల్లో బాలికలు ఆసక్తి కనబర్చారన్నారు. ప్రతి ఆదివారము గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ విద్యార్థులకు తెలిపారు.

పెరవలి : మండలంలోని ముక్కామల, పెరవలి శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమం జరుగుతోంది. స్పోకెన్ ఇంగ్లీష్, క్రాఫ్ట్ వర్క్, డ్రాయింగ్‌లో నైపుణ్యతలపై శిక్షణ ఇచ్చారు. కథలు చదివించడం, చెప్పడంపై అవగాహన కల్పించారు. అత్యాశకు పోతే కలిగే నష్టం 'నీతికథ'ను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బ్లూటూత్ డివైస్ ద్వారా చెప్పారు. చెస్, లూడో వంటివి ఆడించారు. విటమిన్-ఎ లభించే ఆహారపదర్థాలు, విటమిన్ ఎ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం క్విజ్ నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు రిసోర్స్ పర్సన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

విభజన సమస్యలపై దృష్టి పెట్టాలి

- అగమ్యగోచరంలో పోలవరం ప్రాజెక్టు
- ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమీ బాగోలేదు
- రాష్ట్ర విభజనపై దశాబ్ద ఘోషను ప్రస్తావించిన ఉండవల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

'సరిగ్గా ఈరోజుకు ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యింది. తెలంగాణలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి మాత్రం దశాబ్ద ఘోషగా మారింది. ఎందుకంటే విభజన హామీలు నెరవేరలేదు. పోలవరం ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత పదేళ్లుగా రెండు ప్రభుత్వాలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదు. మొత్తం మీద ఏపీ పరిస్థితి ఏమీ బాగోలేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఒక్కటే అన్నట్లుగా ఇప్పటివరకు సాగింది. ఎవరు అధికారంలోకి వచ్చినా రాష్ట్ర విభజన సమస్యలపై ఇప్పటికైనా దష్టి పెట్టాలి' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు అయిన సందర్భంగా స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన బుక్ బ్యాంకులో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ గ్యాప్ రూ.32,625 కోట్లు కేంద్రం భర్తీ చేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటి వరకూ రూ.5,617కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. పోలవరం 48శాతం మాత్రమే పూర్తయిందని, ఇంకా 52శాతం పూర్తి కావాల్సి ఉందన్నారు. అయినప్పటికీ రూ.521.62 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉందని కేంద్రం వెబ్ సైట్‌లో పెట్టేసిందని ఆయన వాపోయారు. జాతీయ ప్రాజెక్ట్‌గా కేంద్రమే దీన్ని పూర్తిచేయాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్రం అడిగితేనే రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చామని కేంద్రం లోక సభలో చెప్పిందన్నారు. కేంద్రమే ఇచ్చిందని రాష్ట్ర శాసన సభలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని ఉండవల్లి గుర్తుచేశారు. అసలు అడిగితె ఇచ్చారా, అడగకుండా ఇచ్చారా వంటి అంశాలకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఎక్కడా లేకపోవడం వింతగా ఉందన్నారు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ ఖర్చు మొత్తం కేంద్రమే భరించాలని 2017లో అప్పటి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కెవిపి రామచంద్రరావు అమరావతిలో కేసు వేశారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు అఫడవిట్ వేయలేదని, ఇందులో తాను కూడా ఇంప్లీడ్ అయ్యానని ఉండవల్లి ప్రస్తావించారు.



పోలవరం ప్రాజెక్ట్‌కి సంబంధించి ఇంకా డ్యామ్ మొదలవ్వలేదని, ఈలోగానే డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందన్నారు. దీనికి కారకులైన అధికారులపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. టిడిపి, వైసిపిలు విమర్శలు చేసుకోవడమే తప్ప కారకులను గుర్తించడంలో శ్రద్ధ చూపలేదన్నారు. అసలు ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రత్యేక హోదా లేదని, ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ ఇన్సిటివ్‌లు కూడా ఇవ్వలేదని తెలిపారు. తెలంగాణలో ఉన్న ఆస్తుల విలువ 2023నాటికి రూ.1,42,601 కోట్ల రూపాయలుగా ఉందని, ఈ విషయంలో ఏపీకి రావాల్సిన 58శాతం వాటాకు సంబంధించిన బకాయిలు ఇంతవరకు రాలేదన్నారు. గడిచిన రెండు ప్రభుత్వాలూ ఈ విషయంలో విఫలమయ్యాయన్నారు. విభజన అంశంపై సుప్రీం కోర్టులో తాను వేసిన పిటిషన్‌పై జగన్ ప్రభుత్వం అఫడవిట్ వేసినప్పటికీ ఇంతవరకు ముందుకు తీసుకెళ్లలేదని తెలిపారు. ఇక ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్లు అన్నప్పటికీ ముందుగానే వచ్చేశామన్నారు. ఇప్పటివరకు కొనసాగి ఉంటె, పన్నులు వస్తాయన్న కారణంగా మరో పదేళ్లు కొనసాగించమని తెలంగాణ ప్రభుత్వమే కోరేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఉండవల్లి చెప్పారు.

ఏపీ పరిస్థితి ఏమాత్రం బాగోలేదని ఉండవల్లి పేర్కొన్నారు. ముఖ్యంగా చంద్రబాబు, జగన్ వ్యాపారాలకు సంబంధించిన కేంద్ర కార్యాలయాలు హైదరాబాద్ లోనే ఉన్నాయని, ఏపీకి రాలేదని, దీనివల్ల పన్నులు మనకు రావడం లేదని అన్నారు. సినిమా పరిశ్రమ కూడా రాలేదని గుర్తుచేశారు. 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని, ఎవరు వచ్చినా విభజన సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య చర్చ జరగాలన్నారు. ఇక్కడ చర్చ కంటే ఎక్కువగా రచ్చ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జితేంద్ర 'ప్రజాభీష్టం' బుక్ లెట్ ఆవిష్కరణ

వివిధ ప్రజా సమస్యలు, అంశాలకు సంబంధించి రాబోయే ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ, రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర రూపొందించిన బుక్ లెట్‌ని ఉండవల్లి తొలుత ఆవిష్కరించారు.

ధాన్యం బకాయిలు చెల్లించకపోతే ఆందోళన

ప్రజాశక్తి - చాగల్లు

రబీ ధాన్యం బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. చాగల్లు రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం తూర్పుగోదావరి జిల్లా రైతు సంఘం కార్యదర్శి గారపాటి వెంకటసుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించారు. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీలో ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించారన్నారు. నెలరోజులు దాటుతున్నా నేటికీ సొమ్ములు చెల్లించకపోవడం దారుణమన్నారు. ధాన్యం డబ్బులు చేతికి అందక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రెండు మూడు రోజులకే ధాన్యం డబ్బులు చెల్లించిన ప్రభుత్వం ఎన్నికల తర్వాత పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రైతులకు, కౌలు రైతులకు చెల్లించాల్సిన బకాయి సొమ్ముల నిధులు విడుదల చేయాలన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామన్నారు. కృష్ణా, గోదావరి డెల్టాల పంట కాలువలను ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పూర్తిస్థాయిలో అందలేదని, జీలుగ విత్తనాల కోసం ఆర్‌బికెల చుట్టూ రైతులు తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని కోరారు. ఖరీఫ్ సాగుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని కోరారు. రైతులకు, ప్రజలకు నష్టదాయకంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయాలన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు తమ భూములపై హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు నీతి అయోగ్ రూపొందించిన చట్టాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ లో అమలు చేసి రైతులు ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాసే దుర్మార్గ చర్యలను అందరూ ఖండించాలని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసే వరకు రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం కంకటాల బుద్ధుడు, కె.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


కౌంటింగ్ సిబ్బంది సక్రమంగా వ్యవహరించాలి

రాజానగరం : కౌంటింగ్ సిబ్బంది విధుల నిర్వహణలో సక్రమంగా వ్యవహరించి చక్కటి పనితీరును కనబర్చాలని, సమన్వయం చేసుకోవడం కీలకం అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. నన్నయ్య యూనివర్సిటీలో కౌంటింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జూన్ 4వ తేదీ మంగళవారం కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందిని తొలి ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎన్నికల పరిశీలకులు సమక్షంలో రెండవ ర్యాండమైజేషన్ చేసి, నియోజక వర్గాల వారీగా కేటాయించినట్లు తెలిపారు. కౌంటింగ్ రోజున ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు లెక్కింపు కోసం శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకునే క్రమంలో కౌంటింగ్ ప్రక్రియపై ఆదివారం శిక్షణ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కౌంటింగ్ టేబుల్స్‌కి అధికారులు, సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా సాంకేతిక పరమైన విధానంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంలో బాధ్యతల నిర్వహణపైనే దృష్ట పెట్టాలన్నారు. తద్వారా త్వరితగతిన అనుకున్న సమయంలోగా కౌంటింగ్‌ను పూర్తిచేయడం సాధ్యమనవుతుందని మాధవీలత తెలిపారు.కౌంటింగ్ చేసే వారి మధ్య సమన్వయం, పరస్పర అవగాహన కలిగి ఉండడం కీలకం అని స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసేందుకు అందుబాటులో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఉంంటారన్నారు. పార్లమెంటు నియోజక వర్గ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ కోసం స్థానిక పరిపాలన భవనంలో 15 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం పోలైన సుమారు 15,300 ఓట్లను కౌంటింగ్‌కు ముందుగానే సమానంగా అన్ని టేబుల్స్‌కీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.నరసింహులు, కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్ పాల్గొన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నల్లజర్ల : నల్లజర్ల మండలం దూబచర్లలో పార్డ్ ఇండియా స్వచ్ఛంధ సేవా సంస్థ, లయన్స్ క్లబ్ దూబచర్ల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 100 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో వీటిని నిర్వహించారు. 10 మందికి కంటి ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు సూచించారు. వారిని ఆపరేషన్ల నిమిత్తం వేమగిరిలోని ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ వీరికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డి.షరీఫ్, వెంకట శ్రీనివాసరావు, కృష్ణ ప్రసాద్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్‌పి జగదీష్ తెలిపారు. ఏలూరు రేంజ్ స్పెషల్ ఆఫీసర్, కమిషనర్, సెబ్ బ్యూరో ఎం.రవిప్రకాష్ ఈ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. నన్నయ యూనివర్సిటీనీ సందర్శించి, బందోబస్త్ ఏర్పాట్లను పరిశిలించారు. అధికారులు, సిబ్బందికి, ఏజెంట్లకు సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలంతా సామరస్యంగా మెలగాలని, ఎటువంటి ఉద్వేగాలకు లోను కాకూడదన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగించరాదన్నారు. సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఎవరూ ఉద్వేగపూర్వక ప్రసంగాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించరాదన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సంయమనం పాటించేలా పార్టీల నాయకులు, అభ్యర్థులు చూసుకోవాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియపై ఆదివారం ట్రైల్ రన్‌ను నిర్వహించామన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ హాల్స్ వద్ద(సిఎపిఎఫ్), కౌంటింగ్ హాల్స్ బయట(ఎస్‌ఎపి), కౌంటింగ్ జరిగే ఆవరణంలో సివిల్, ఎఆర్ అధికారులు, సిబ్బందితో భద్రత కల్పించామన్నారు. కౌంటింగ్ ఆవరణలో 152 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది ద్వారా వాటిని మోనిటర్ చేస్తామన్నారు.



రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్స్, జనరల్ ఏజెంట్స్, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే కౌంటింగ్ హాల్లోకి అనుమతిస్తామన్నారు. దీని కోసం 40 డిఎఫ్‌ఎండిఎస్‌ను, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వార కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు తగు సూచనలు ఇస్తామన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా అక్రమంగా గుమిగూడిన వారిని చెదరగొట్టడానికి వజ్ర వాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్‌ను కౌంటింగ్ జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేశామన్నారు.

కౌంటింగ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోదించే క్రమంలో, 129 సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రదేశాల్లో 39 పోలీస్ పికెట్స్, 59 మొబైల్ పార్టీలు, 13 క్యూఆర్‌టి టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద పికెట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకుగాను జిల్లా ప్రజలు, మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణంలో తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.37 లక్షల విలువ గల టివీలు, ఫ్రిజ్‌లు, గ్యాస్ సిలిండర్లు, వాషింగ్ మిషన్, ల్యాప్‌టాప్ తదితర సామాగ్రిని స్వాధీనపరచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాజశేఖర్ మాట్లాడుతూ సిఐ షణ్ముఖం ఆధ్వర్యంలో ఎస్‌ఐ మృగానందం పర్యవేక్షణలో పోలీసులు నిఘా పెట్టడంతో ఇద్దరు నేరస్తులను గుర్తించి అరెస్టు చేసినట్టు తెలిపారు. అలాగే రూ.15 వేలు విలువ గల గుట్కా పాన్ ప్యాకెట్లను బైక్‌పై తరలిస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు - పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రయాణికులతో వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం కాకినాడ నుంచి అమలాపురం డిపో బస్సు ప్రయాణికులతో వస్తున్న ఆర్‌టిసి బస్సును హైదరాబాదు నుంచి యానం వైపు వస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు, డ్రైవర్ గాయపడగా, ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులు డ్రైవర్ గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగే సమయంలో ఆర్‌టిసి బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. అలాగే ప్రయివేట్ ట్రావెల్స్‌లో 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాద ఘటనలో ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయ పడ్డారు. ఆర్‌టిసి బస్సులో గాయపడిన ప్రయాణికుల్లో 12 మందిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో అంబాజీపేటకు చెందిన రామసీత, జి శ్రీనివాస్ (కాకినాడ), డి.జాన్‌బాబు (భీమవరం), సిహెచ్. కృష్ణ వేణి(గుత్తేనదివి), ఎం.కుమార్ (అమలాపురం) తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వ్యాకరణంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. అలాగే నీతి కథలను చదివించి అనంతరం ఆ కథలు వారితో చెప్పించారు. ఈ నీతి కథలు సారాంశాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు.

పులిమేరులో మహా అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరు గ్రామం చదలాడ జంక్షన్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోపు మురళి, సుందర్ రెడ్డిరాజు, సింగన చంటియ్య, మసిముక్కల రామకృష్ణ, తోట శేషారావు, ముమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


అంగర పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన జెసిబి, ట్రాక్టర్

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో ఆదివారం అక్రమంగా మట్టి తవ్వకాలను చేపట్టడంతో రెవిన్యూ అధికారులు స్పందించి అడ్డుకున్నారు. స్థానిక ఒయన్‌జిసి రోడ్డు సమీపంలో జెసిబితో మట్టిని తవ్వుతున్నట్లు సమాచారం అధికారులకు అందింది. దీంతో విఆర్ఒ నాగమణి తదితరులు ఘటనా స్థలానికి చేరుకోగా ట్రాక్టర్ డ్రయివర్ పరారయ్యాడు. ఘటనా స్థలంలో జెసిబి, ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని కస్టడీ నిమిత్తం అంగర పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు విఆర్ఒ తెలిపారు. ఈ ఘటనపై మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆమె తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని అంగర ఎస్ఐ అందే పరదేశి హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సెక్షన్ 144, 30 ఉన్నాయన్నారు. జిల్లా ఎస్‌పి ఆదేశాను సారం గ్రామాల్లో పోలీస్ సిబ్బంది తో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ శాంతి భద్రతలపై ఆదివారం కోరుమిల్లి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని పోలీస్ శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాల కు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


కోరుమిల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ పరదేశి

తప్పని తాగునీటి కష్టాలు..!

- పట్టణ ప్రజలకు పసరు నీరే గతి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

వేసవికాలంలో ఏటా పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మున్సిపాలిటీ నుంచి సరఫరా చేసే పసరునీరే ప్రజలకు దిక్కు అన్నట్లు పరిస్థితి మారిపోయింది. అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, ప్రజా ప్రతినిధులు హామీలను పట్టించుకోకపోవడంతో ప్రజలు ప్రతియేటా వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించే ఫిల్టర్ బెడ్ చెరువులో జలాలు అడుగంటి నాచు పేరుకు పోవడంతో సుమారు నెల రోజులుగా కుళాయిల ద్వారా పసరునీరే సరఫరా అవుతోంది. ఆ నీటిని తాగేందుకు ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్‌ల నుంచి డబ్బు వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు మరికొందరు పసరు నీటినే నేరుగా వినియోగిస్తున్నారు. మరికొందరు పసరు నీటిని మరగబెట్టి వినియోగిస్తున్నారు. అవగాహన లేమితో నేరుగా తాగుతున్న పలువురు అనారోగ్యాల భారిన పడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. మున్సిపాలిటీ నుంచి సరఫరా అవుతున్న నీటిలో ఎలాంటి లోపాలు లేవని మున్సిపల్ అధికారులు ప్రకటించడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా గురువారం సైతం ఫిల్టర్ బెడ్ చెరువును, ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జె.రామారావు కుళాయిల ద్వారా అందించే తాగునీటిలో ఎలాంటి లోపాలు లేవని జలాలను పరీక్షలకు పంపగా రిపోర్ట్ మంచిగా వచ్చినట్లు ప్రకటించారు. అయితే తాము సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి తాగాలని ఉచిత సలహాను ఇచ్చి చేతులు దులుపుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏడాది ఎండల తాపం 43 డిగ్రీలు వరకూ నమోదవుతోంది. దీంతో తాగినీటి వినియోగం అధికం అయ్యింది. దీంతో మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న పసరు నీటిని తాగే సాహసం చేయలే ప్రయివేట్ వాటర్ ప్లాంటులను ఆశ్రయించక తప్పడం లేదు.

ఫిల్టర్ బెడ్ చెరువుపై నిర్లక్ష్యం

పట్టణ ప్రజల తాగునీటి కోసం సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ చెరువును అధికారుల నిర్లక్ష్యం వెంటాడుతోంది. మార్చి నెల ప్రారంభం కాకముందే స్వచ్ఛమైన నీటిని ఫిల్టర్ బెడ్ చెరువులో నింపుకోవాల్సి ఉంది. అలాగని ఫిల్టర్ బెడ్ చెరువుకు అవుట్ లెట్ ఏర్పాటు లేకపోవడంతో చెరువులో పూడిక తీయాల్సివుంది. చెరువులోకి గోదావరి జలాలు చేరడం తప్ప ఎప్పుడూ చెరువులో పేరుకు పోయిన పూడికను తొలగించిన దాఖలాలు లేవు. ఇదే చెరువు నుంచి ఎన్ఎఫ్‌సిఎల్ పరిశ్రమకు నీటి సరఫరా జరుగుతోంది. ఇందుకు సంబంధించి పరిశ్రమ అవసరాల కోసం ఒక అవుట్ లెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పరిశ్రమకు అవసరమైన నీటి కోసం చెరువును ఎండని వ్వకుండా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల పూడికను తొలగించే పరిస్థితి లేకుండా పోతుందని పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఈ చెరువును మున్సిపాలిటీ ఆదాయవనరుగా భావించి ఈ చెరువును ఫిషర్ మెన్ సొసైటీకి లీజుకు ఇవ్వడంతో ఈ జలాలు కలుషితం అవుతున్నాయనే వాదన లేకపోలేదు.



మూత పడిన బ్రౌన్ పేట వాటర్ సప్లై ఫిల్టర్ ప్లాంట్


ఎన్ఎఫ్‌సిఎల్ ఫిల్టర్ బెడ్ తాగునీటి చెరువు (ఇన్‌సెట్‌లోక్లోరినేషన్ ప్లాంట్లో నాచుపట్టిన జలాలు)

వాటర్ ప్లాంట్‌ల నిర్వహణ అధ్వానం

దాతల సహకారంతో మున్సిపాలిటి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లు నిర్వహణ అధ్వానంగా ఉంది. బ్రౌన్ పేటలో ప్రారంభించిన వాటర్ ప్లాంట్ కొద్ది రోజుల్లోనే మూతపడింది. అయితే సంబంధిత వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వాటర్ ప్లాంట్‌కు కూత వేటు దూరంలోనే మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబ జాన్ మోజెస్ నివాసం ఉండడం గమనార్హం.

పైపులైన్ హామీ గాలికే...

పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేస్తామన్నా పాలకుల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ధవళేశ్వరం నుంచి సామర్లకోట ఫిల్టర్ బెడ్ చెరువులోకి ప్రత్యేక పైపులైన్ ద్వారా గోదావరి నీటిని తీసుకొస్తామని పలువురు ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రతిపాదనలను అధికారులు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. ఏళ్లు గడుస్తున్నా ఆ ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు.

అమృత పథకంలో నిధుల కేటాయింపు

ఏళ్ల తరబడి ఉన్న పైపులైన్ లీకేజు వల్ల పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనేది అమృత పథకం లక్ష్యం. ఆ పథకంలో నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందచేశారు. దీంతో అమృత పథకంలో రూ.23.26 కోట్లతోపాటు, ఇతర అవసరాల కసం మరో రూ.2 కోట్లు పట్టణానికి మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పాత పైపులైన్ స్థానంలో అవసరమైన చోట కొత్త పైపులైన్ వేసేందుకు, అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు నిర్ణయం అయ్యింది. అయితే నిధులు మంజూరు అయినా నేటికీ సంబంధిత పథకంలో పనులు చేపట్టిన పరిస్థితి లేదు. అయితే ధవళేశ్వరం నుంచి ప్రత్యేక లైన్ ద్వారా గోదావరి నుంచి నీటిని తరలించేందుకు అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఆ ప్రతిపాదనల పరిస్థితి ఎలా ఉందనేది నేటికీ ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, కొత్తగా వచ్చే ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి కోసం రైతుల నిరసన

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాగునీటి సరఫరా కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పత్తిగొంది పంట కాలవ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజబాబు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా తొలకరిలో అతివృష్టి, దాల్వాలో అనావృష్టి ఫలితంగా కౌలు రైతులు పూర్తిగా నష్టపోతున్నారని అన్నారు. గడిచిన సంవత్సరంలో తొలకరిలో కూడా నీటి ఎద్దడి తలెత్తిందన్నారు. ప్రతి సంవత్సరం దాల్వాలో 600 నుంచి 700 ఎకరాలు సాగునీరు అందక పంటలు పండడం లేదని తెలిపారు. రైతులు అన్ని పనులు మానుకుని రోడ్డు మీదకు వస్తేనే అధికారులు అరకొర సాగునీరు అందిస్తున్నారని అన్నారు. పంటలు పండినప్పటికీ సాగునీరు డీజిల్ ఇంజన్ల ద్వారా తోడుతున్న కారణంగా ఇతర ఖర్చులతోపాటు డీజిల్ ఖర్చు ఎకరానికి రూ.7 వేలు పెట్టుబడి అవుతున్న కారణంగా రైతులు నష్టాలు పాలవుతున్నారని అన్నారు. ఇంజరం వంతెన వద్ద కరకట్టు తొలగించి వెంటనే వంతెన నిర్మాణం చేయాలని, పంట కాలువ పైనుంచి కింద వరకు పూర్తిగా బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పేరాబత్తుల సాయి నరేంద్ర, భైరవమూర్తి, అనుసూరి చిన్న, సత్యనారాయణ, దున్న నాగరాజు, వానపల్లి సత్యనారాయణ, పిల్లి లోవరాజు, పంపన నాగేశ్వరరావు, దున్న సుబ్రహ్మణ్య స్వామి, దొమ్మేటి శీను బాబు, పంపన శ్రీను, పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.


కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నివాస్

మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం

ప్రజాశక్తి - కాకినాడ

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమైనదని, ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం జడ్‌పి సమావేశ మందిరంలో జరిగింది. శిక్షణ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్, జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, వివిపాడ్స్ స్లిప్పులు కౌంటింగ్, రీ కౌంటింగ్, రౌండ్లు వారిగా ఫలితాలు వెల్లడి చేసే విధానం, ప్రత్యేక సందర్భాల్లో వ్యవహరించాల్సిన విధానం తదితర అంశాలపై సిబ్బందికి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు- 2024 నిర్వహణ చివరి దశకు చేరుకుందన్నారు. ఓట్ల లెక్కింపు అనేది ఎన్నికల ప్రక్రియ అంతటిలో అత్యంత ముఖ్యమైన దశ అని అన్నారు. జెఎన్‌టియులో మంగళవారం నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఇసిఐ మార్గదర్శకాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి సందేహం లేకుండా ప్రతి దశలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ని నియమించడం జరుగుతుందని, జిల్లాలో ఏ నియోజకవర్గంలోను రీ కౌంటింగ్‌కు అవకాశం లేకుండా కౌంటింగ్ సూపర్‌వైజర్లు ఏజెంట్లను సమన్వయం చేసుకుంటూ సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రత్యేక పరిస్థితులు నెలకున్న సందర్భంలో కౌంటింగ్ ఆలస్యం కాకుండా అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, జడ్‌పి డిప్యూటీ సిఇఒ జిఎస్.రామ్‌గోపాల్, ఎన్నికల సిబ్బంది, జిల్లా నోడల్ అధికారి పి.నారాయణమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎసిబి ఎస్‌పి కె.రామ మోహనరావు హెచ్చరించారు. ఆదివారం పిఠాపురంలో కేంద్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్, మాక్ డ్రిల్ నిర్వహించారు. పట్టణంలోని ఉప్పాడ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ ఫాస్ట్ కోటగుమ్మం, మున్సిపల్ ఆఫీస్, చర్చి సెంటర్ గొల్లప్రోలు టోల్ ప్లాజా వరకు సాగింది. అనంతరం టోల్ గేట్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సదర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇప్పటికే కౌంటింగ్‌కి ముందస్తు భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున జిల్లాలో సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. ప్రజాలెవ్వరు గుమ్మిగూడి ఉండరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, విజయోత్సవ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం వంటివి నిషేధం అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్ళే మార్గంలో ఐదు అంచెల్లో కటాఫ్ పార్టీలు, పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన, శాంతిభద్రలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి ప్రమోద్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు, కేంద్ర సాయుధ బలగాల పోలీసులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎసిబి ఎస్‌పి

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు ఎస్.గణేష్ తెలిపారు. స్థానిక జెఎన్‌టియుకెలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన ఆర్ఒ వెంకటరావుతో కలిసి ఆదివారం సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గ కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓట్ల కౌంటింగ్ కోసం మరో ఐదు టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందని ఆర్ఒ వెంకటరావు తెలిపారు. అలాగే సర్వీస్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం 5 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు.


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు గణేష్

ఘనంగా 'బివిసి'లో అచీవర్స్ డే

ప్రజాశక్తి-అమలాపురం

బివిసి గ్రూప్ నందు 2023-24 సంవత్సరంలో పాస్డ్ ఔట్ అయ్యిన విద్యార్థుల్లో ట్రయినింగ్ అండ్ ప్లేసెమెంట్ ద్వారా వివిధ కంపెనీల్లో ప్లేస్ అయ్యిన విద్యార్థులతో అచీవర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి బివిసి మూడు కళాశాలల్లో ఒడలరేవు, భట్లపాలెం, రాజమహేంద్రవరం క్యాంపస్ ల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ట్రయినింగ్ అండ్ ప్లేసెమెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో ప్లేసెమెంట్ అధికారులు బొబ్బిలి మధుకుమార్, అడబాల కుమార్, వెంకట చలం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు విపరీతమైన కొరత ఉన్నదని అయ్యినప్పటికీ మా గ్రూప్‌కి ఉన్న స్ట్రాంగ్ ప్లేసెమెంట్ నెట్వర్క్ కారణంగా 1000కి పైగా విద్యార్థులు వివిధ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాలల ఛైర్మన్ బోనం కృష్ణ సతీష్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు వాళ్ళ ఉన్నతమైన భవిష్యత్ కు అవసరమైన వివిధ సర్టిఫికెట్ కోర్సులను కూడా నేర్పిస్తున్నామన్నారు. తద్వారా వారు మంచి వార్షిక వేతనాలను ఆర్జిస్తున్నారని అందువలన ఇన్ఫోసిస్ విప్రో ఎంపసిస్, టెక్ మహేంద్ర లాంటి పెద్ద కంపెనీ లలో ప్లేసెమెంట్ వస్తుందన్నారు. ప్రిన్సిపల్ డా.రామారావు మాట్లాడుతూ మా మీద నమ్మకం తో జాయిన్ చేసిన తల్లిదండ్రులు నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. డీన్ జనార్దన్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది ఐటిల్లో కూడా 35శాతం విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వలేకపో యాయన్నారు. కాని బివిసి విద్యార్థుల్లో అర్హత ఉన్నవారిలో 90 శాతం మంది ఉద్యోగాలు సాధించారన్నారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఎంపికైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను సత్కారించారు. కార్యక్రమంలో ఎఒ జక్కం కృష్ణా రావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ బండారు ఫణి శంకర్, కంట్రోలర్ అఫ్ ఎగ్జామ్స్ అందే రాజగోపాల్ వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.



అచీవర్స్ డే లో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

యానాం వార్తలు


మూఢనమ్మకాలపై మ్యాజిక్ చేస్తున్న నిపుణుడు

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

ప్రజాశక్తి - యానాం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు మదర్ థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన బాలల వేసవినోదకేంద్రం ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా చెరుకుపల్లి చెందిన సైంటిఫిక్ మ్యాజిక్ నిపుణుడు అనేక అంశాలలో మ్యాజిక్ చేసి ఇదంతా సైన్సు తప్పితే మహిమలు, తంత్రాలు లేవని బాల బాలికలక అవగాహన కల్పించారు. ఈ అంశాలు పిల్లలను బాగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక జిప్మర్ బ్రాంచ్ డిఫెన్స్ రంగం మేనేజర్ ఎన్‌వి.రమణ డిఫెన్స్ రంగం ప్రాముఖ్యత, ఆరోగ్యంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, యానాం కమిటీ ఉపాధ్యక్షుడు దంగేటి త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి మాస్టర్, సిఐటియు నాయకులు టి.శ్రీనివాస్, కుంచే సత్యనారాయణ, ఇళ్ళ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌సి సొసైటీ భూముల పరిశీలన

ప్రజాశక్తి - యానాం


రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

స్థానిక దరియాలతిప్పలోని ఎస్‌సి సొసైటీ భూములను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. వరదల సమయంలో, అధిక వర్షాలతో గోదావరిని ఆనుకుని ఉన్న గట్టు కొట్టుకుపోవడంతో తమ భూములు ధ్వంసం అవుతున్నాయని తెలిఆరు. వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, పక్కనే ఉన్న రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థలతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సంఘ ఉపాధ్యక్షుడు కోరుకొండ ఆనందరావు, సెక్రటరీ కొల్లు మాధవ స్వామి, పెద్దలు సబ్బతి శ్రీనివాసరావు, కమిడి బాలయోగి, రైతు సంఘం అధ్యక్షుడు కోరుకొండ బాలయోగి పాల్గొన్నారు.

10 వరకు సెంటాక్ గడువు పెంపు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలోని వివిధ కళాశాలలో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ ఆధ్వర్యంలో స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బిటెక్, బిఆర్‌కె, బిఎస్‌సి, బిపిటి, అగ్రికల్చర్ తదితర పారామెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు పంపాలన్నారు.

యానాం చేరుకున్న కౌంటింగ్ పరిశీలకులు

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 4న యానాం నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కౌంటింగ్ పరిశీలకులు రాకేష్ కుష్ రె ఆదివారం యానాంకు చేరుకున్నారు. ఆయనకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి స్వాగతం పలికారు.

కార్మికుల తొలగింపుపై నిరసన



సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని చిన్నింపేట జాతీయ రహదారి చెరువులో గల జీడి పిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 80 మంది కాంటాక్ట్ కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆదివారం ఎర్రవరంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత నెల 23న జిల్లా కార్మిక సంక్షేమ అధికారి, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ తహశీల్దార్లకు తొలగింపుపై ఫిర్యాదు చేశామన్నారు. తొలగించిన వారిని సంస్థ యాజమాన్యం 25వ తేదీన పనిలోకి తీసుకుంటూ జాయింట్ కమిటీ సమావేశం జరిగే వరకు ఎవరిని పనుల నుంచి తొలగించమని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. శనివారం యథావిధిగా పనులకు వచ్చిన కార్మికులను ఫ్యాక్టరీలోకి రాకుండా గేటు వద్ద నిలుపి వేసారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు కల్పించుకుని కార్మికులను పనిలోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఈశ్వరరావు డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో ఆందోళన తీవ్ర స్థాయికి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.సాల్మన్ రాజు, టి.ఏసుబాబు, ఎం.కృష్ణమూర్తి, ఎన్.సుబ్బారావు, వీరమణి, పార్వతి, కనకలక్ష్మి, నాగలక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు పాల్గొన్నారు.